
# సిరిసిరి మువ్వ

పైడిపాటి సుబ్బరామశాస్త్రి

"ఎవరది? మువ్వా !" అన్నది, దుర్గ,మువ్వడి తల్లి "నేనే !" అని మువ్వడు లోపలి కడుగుపెట్టాడు. "ఆ వెలుతురు పిల్ల ఎవరు రా?" అన్నది వెనుక ఉన్నదాన్ని చూసి "సిరిసిరి —లే ! ఎత్తుకొచ్చా !" అన్నాడు బరువుగా నిట్టూరుస్తూ. ఆమె ఎగాదిగా చూసింది. సిరిసిరి కూడా నిట్టూరుస్తోంది.

మువ్వడిది స్ఫురద్రూపం. పుట్టగోచీ పెట్టి విల్లంబులతో నిలబడితే విశాలవక్షస్థలంతో ఆకర్షకంగా ఉంటాడు. సిరిసిరి పక్క నిలబడితే ఈడూజోడూదీటుగా ఉంటుంది. "గుంటడు చెప్పింది నిజమేనా, గుంటా?" అన్నది,దుర్గ 'ఔ' అన్నది సిరిసిరి. "అమ్మా, అబ్బా ఇష్టపడలేదా? సిరిసిరి తల అడ్డంగా తిప్పింది. "కయ్యం జఱిగిందా?" జఱిగింది 'పుడమి పండుగ'లో ఇది 'రెల్లో'పాట పాడుతూ అందంగా అందఱితో కలసి, సగం చందమామ వరుసలో చిందులు తొక్కుతోంది. రెల్లో అన్నప్పుడల్లా నా గుండె జిల్లుమని చూపు నిలిపేశాను.



నృత్యం అయిపోయిన తర్వాతచేయిపట్టుకున్నాను, పెళ్ళి కాని పిల్ల కనుక ! తల్లిదండ్రులూ, అన్నదమ్ములూ అడ్డం వచ్చారు. వాళ్లను విదలించి విదలించి దీనిని గుంజుకు వచ్చాను. ఇది కూడా రానని పెనుగులాడింది. కృష్ణుడు రుక్మిణిని ఎత్తుకు వచ్చినట్లు ఎత్తుకు వచ్చాను" అన్నాడు, మువ్వడు.

"సిగ్గు లేదూ ! రుక్మిణికి కృష్ణుడి మీద మనసుండి వార్త పంపింది. నాకు నీ మీద మక్కువుండి చెప్పంపానా?" అన్నది సిరిసిరి. "లేదా?" అన్నది, దుర్గ "నేనొల్ల".అన్నది సిరిసిరి. విత్తనాలు చల్లేటప్పుడు చేసుకునే పండుగ పుడమి పండుగ. అందులో సిరిసిరి మీద కన్ను పడి, మువ్వడు బలవంతాన లాగుకువచ్చాడు. గిరిజనులలో పెద్దలునిర్ణయించి చేసే పెళ్ళిళ్ళే ఎక్కువ. వాటికే విలువ ఎక్కువ. ఇల్లాంటి రాక్షస వివాహానికి విలువ తక్కువ. సిరిసిరి తల్లిదండ్రులకు మువ్వడికి పిల్లనివ్వడం ఇష్టం లేక పోయినా వారే మువ్వడితో పోట్లాడి సర్దుకున్నారు. కాని మిగిలిన సంఘం సహాయం కోరలేదు. సంఘానికి ఈ విషయం తెలిసినా, పెళ్ళి అయిన పిల్లను ఎత్తుకుపోవడం వారి దృష్టిలో నేరంకాని, పరాక్రమం చూపించి పెళ్ళి చేసుకుంటానని తీసికొనిపోవడం నేరం కాదు. పెళ్లి అయితేనే ఆ స్త్రీ, పరస్త్రీ అవుతుంది. పైగా ఇద్దరూ ఒక కులం వారే కనుక పట్టింపు లేదు. అడవి దున్న కొమ్ము ధరించి కిరీటంగా, ఆనాడు మువ్వడు డోలు వాయిస్తూ నృత్యంలో అందంగానే కన్పించాడు, సిరిసిరికి. అయినా, ఇంతవరకూ ఆమె ఎవరికీ మనసివ్వలేదు.

గిరిజన జాతులన్నీ , సుమారుగా సమానంగా ఉన్నా, వారిలో ముప్పై మూడు తెగలున్నవి. ఒక్క తెలుగు గడ్డమీదే ! ఖమ్మం, వరంగల్ మండలాల్లో కోయలూ, కొండరెడ్లూ, నాయకపోడు, సుగాలీ జాతులున్నాయి. ఆదిలాబాద్ జిల్లాలో గోండ్లు, యాంకలు, లోథిస్, కోలం తెగలవారున్నారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖలలో,వాల్మీకి, భగత్, మూకదొర, కొండదొర, సామంత, సవర, గదబ, జాతుల వారున్నారు. మహబూబ్‌నగర్, ప్రకాశం జిల్లాలలో చెంచులున్నారు. ఒక్క ఖమ్మం జిల్లాలోనే నాలుగు లక్షలన్నర గిరిజనులున్నారు. భద్రాచలం ఏజెన్సీలో కోయలు, కొండరెడ్లు, గొట్టికోయలు, డోలు జాతులవారున్నారు. సవరభాషకుమాత్రం గిడుగు రామమూర్తి పంతులు గారు వ్యాకరణం రాశారు. ఇంచుమించు గా గిరిజనుల భాషలన్నీ లిపిలేనివే. ఈ భద్రాచలం కోయలకు ముత్యాలమ్మ, మద్దిరామమ్మ దేవతలు. పంటలు రాగానే చేసుకునే 'కొత్తల పండుగ' లో ఆ దేవతా ప్రీతిగా ఇప్పకల్లు తాటికల్లు నైవేద్యం పెట్టి తలాకాస్త పుచ్చుకొని ఆనంద తాండవం చేస్తారు.



కస్టమర్: ఈ... నా ముగ్గురు పిల్లలకీ షర్ట్ బట్ట ఎంత తెమ్మంటావ్.

టైలర్: ఓ... ఎనిమిది మీటర్లు తే?

కస్టమర్: అబ్బా... అంత పడుతుందా...?

టైలర్: !!మరి... నాకూ సరిపోవాలి గదా....!!!

— చందనా శ్రీనివాస్, పొటుపల్లి

మన్య ప్రాంతంలో ఉండే గొట్టికోయలకు చెవులకూ ముక్కులకూ పోగులు పెట్టుకోవడం ఆచారం. కొండ రెడ్లకు వెదురు బియ్యం, జొన్నలు, సజ్జలూ ఆహారం. జుట్టు పై కొప్పు, చెవులకు పోగులూ, మెడలో పూసలూ వీరి వేషధారణ. కాపీనంతో ఉండడమే పురుషుల అలవాటు. వీరందరికీ కులం కట్టుబాటు ఉంటుంది. నియమ భంగం చేస్తే వెలివేస్తారు కులపెద్దలు. వారి ప్రభుత్వం వారిదే!

* * *

"నేనొల్ల! నేనొల్ల! అంటావు. చేసుకుంటే చేదుమేస్తావా?" అన్నది దుర్గ. "ఇష్టం లేనిది చేదే!" అన్నది సిరిసిరి. దుర్గకు పై మాట తోచలేదు. మువ్వణ్ణి రమ్మని దూరంగా తీసుకెళ్లింది. "మక్కువ లేని దానిని కట్టుకొని ఏమిబావుకుంటావు?" అని అడిగింది. మనసులేని పిల్లను వదలి వేయమంది. "ఈ పెడి బొమ్మను వదలి వేయాలని తీసుకురాలేదు. బలవంతంగానైనా సరే జతకట్టాలని తీసుకువచ్చాను. తేనె కోసం ఈగ ముసురుతుంది. ఒకప్పుడు రెక్కలకు తేనె అంటుకొని, లేవలేక ఆ తేనె త్రాగుతూనే అందులో చచ్చి ఊరుకుంటుంది. నా పని అల్లా ఉంది. నేను సిరిసిరిని అనుభవించకుండా మాత్రం వదలలేను. కొంత కాలం అల్లా జరిగితే, అప్పటికీ అంకెకు రాకపోతే అప్పుడు ఎవరిదారి వారిది. నేను మన ఆచారం ప్రకారమే చేశాను".

దుర్గ మాట్లాడలేకపోయింది. ఇద్దరినీ చూసి జాలిపడింది. సిరిసిరిని మద్ది రావమ్మ బొమ్మ దగ్గరకు తీసుకుపోయి మువ్వడు తాళికట్టేసి, మువ్వలు గలగల లాడినట్లు సంతోషంతో నవ్వాడు. సిరిసిరి కోపంతోనే సిగ్గుపడింది. ఆ సమయంలో ఆ స్పర్శకు. అత్తకు దణ్ణం పెట్టమన్నాడు. ముఖం మొటమొటలాడించుకుంటూనే దణ్ణం పెట్టింది. "బిడ్డా! పెట్టను బద్ధిరంగా చూసుకో!" అని దీవించింది దుర్గ.

ఆ రాత్రి ఇప్పకల్లు నోటికందించాడు సిరిసిరికి. "నేను ముట్ట!" అన్నది. నిజానికి ఆ కల్లు ఆమెకు చాలా ఇష్టం. లేకపోతేకుతి. మువ్వడి మీద కోపంతో అల్లా అన్నది. ప్రక్కను చూరుకు తగిలించి ఉన్న కొమ్ము తీశాడు. గొడ్డుకు నోరు పగలతీసి పోసినట్లు పోస్తానన్నాడు. అల్లా చేస్తే, నోరు నెత్తుటిమయం అవుతుంది. అందమైన పళ్లు చిట్లిపోయి, వికారపు రూపు వస్తుందని భయపడింది. ఆ కొమ్మును గట్టిగా పట్టుకుంది. "నువ్వు మనిసివి కావు — మెకం!" అన్నది. "తెలుసుకదా!" అంటూ కల్లుపాత్ర నోటికి అందించి త్రాగమని బ్రతిమాలాడు. కొంతసేపు వఱకు ముట్టలేదు. వేలు కల్లులో ముంచి పెదిమెలకు రాచాడు. నాలుకతో తుడుచుకుంది. ఆ రుచికి ఇక ఆగలేకపోయింది. పానపాత్ర అందుకొని గుటగుటా త్రాగేసింది.

తిరిగి దానిని నింపాడు. నోటికందించకుండా దూరంగా ఉంచి అల్లాగే పట్టుకున్నాడు. సిరిసిరి అతని వంక చుఱచుఱా చూసింది. ఆ దొప్పలాగుకొని ఒక్క మాటు నోటితో పీల్చింది.

"పెట్టా! నేను నోటికి అందించాను కదా! ఈ దొప్ప నువ్వు నానోటి కందించరాదా?" అన్నాడు, దీనంగా. అందించకపోతే ఇంకొక దొప్ప తనకేయడేమోనని అందించింది. దానిని ఖాళీచేసి, ఇంకొక దొప్పనింపి చేతికిచ్చాడు. తిరిగి అందించింది. సగం త్రాగి, మిగిలిన దొప్ప సిరిసిరి పెదవుల దగ్గర ఉంచాడు. అంత దగ్గరగా వచ్చిన మద్యాన్ని త్రాగకుండా ఉండలేకపోయింది. అదేవిధంగా దొప్పలతో సగం తాను త్రాగి, మిగిలినవి ఆమె కందిస్తూ ఉంటే త్రాగుతూనే ఉన్నది. కళ్లు సగం మూతపడి అతనివంక మైకంతో చూస్తోంది. అతడూ అల్లాగే చూస్తూ, పెదవికి పెదవి ఆనించాడు. కళ్లూ కళ్లూ కలిపాడు. ఒళ్లూ ఒళ్లూ కలిసిపోయింది. ఆ మత్తులో ఇద్దరూ గమ్మత్తయిన సుఖం — అంతకు పూర్వం ఎరుగనిది అనుభవించారు.

తెల్లవారగట్టకు మైకం దిగిపోయింది సిరిసిరికి. అతనిని ఒక త్రోపుతోసింది. అతడు నవ్వాడు. సిరిసిరి మైకంలో జరిగినదంతా లీలగా నెమరువేసుకుంటూ విస్తుపోతోంది. తెల్లవారి బయటకు రాగానే దుర్గ చూస్తూ "పువ్వులాంటి దానివి ఎల్లా నలిగిపోయావో! మువ్వడు వట్టి కారుదున్న!" అంది. సిరిసిరి తన శరీరం వంక చూసుకుంటూ కొంత సిగ్గుపడింది. ఆడది సిగ్గుపడవలసినంత పడకపోవడం దుర్గ గమనించింది. "స్నానం చేద్దువు గాని రా!" అంటూ రెక్కపుచ్చుకొని ప్రక్కకు తీసుకుపోయింది.

దుర్గ ఏకాంతంగా మువ్వడితో "బిడ్డా! నీకెంత తీపి ఉన్నా నీ ఆలును నువ్వు నమ్మకు. ఇప్ప కల్లంటే దానికెంతో ఇష్టం. ఆమైకంలో వేరే దారిలేక నిన్ను కాదనే శక్తిలేక చెప్పినట్లు వినడం మక్కువ ఉండడంకాదు. దాని

కళ్లు చిరుతపులి కళ్లు. ఎప్పుడో దెబ్బతీస్తుంది. ఆదమరచి నిద్రపోకు" అంది. మువ్వడు ఆ మాటలను మనసులో పెట్టుకున్నాడు.

మరురోజు సిరిసిరికి ఇప్పకల్లు పోసి, తాను పోతు తాడికల్లు త్రాగాడు. ఇద్దరకూ ఒళ్లు తెలియలేదు. తెల్లవారేదాకా ఎవరికీ ఒడలు మీద గుడ్డలు లేవు. సిరిసిరి యౌవనాన్ని చేరలతో త్రాగుతూ, ఆమెకు సుఖం కల్పిస్తున్నా, తనను అనుమానంతొ ఆమె చూస్తూ ఉండడం క్రమక్రమంగా మువ్వడు గమనించి, తల్లి బోధను మననం చేసుకుంటున్నాడు. త్రాగడంలో తాను కాస్త తక్కువ త్రాగుతూ నిద్రా మైకం నటించడం ప్రారంభించాడు. ఒక తెల్లవారకట్ట, మాంసం తెగగొట్టే కత్తిని, సిరిసిరి ఎత్తి ఉండడం గమనించి అలవోకగా ఆ చేయి పట్టేసుకున్నాడు.

సిరిసిరి గజగజలాడిపోయింది. ఆ కత్తినే సిరిసిరి మెడకు గురిపెట్టాడు. "అత్తా!" అని సిరిసిరి వెర్రి కేక పెట్టింది, ఒళ్లు తెలియకుండా. దుర్గ లోపలకు వచ్చి ఆ దృశ్యం చూసింది. కత్తి లాగుకుంది. "ఈ కత్తితోనే ఇది నన్ను చంపాలని చూసింది" అన్నాడు. దుర్గ మాట్లాడలేదు. "రేపటి నుండి విడిగా పడుకోండి" అని మాత్రం అంది. మువ్వడు చంపుతాడనే భయంతో, దుర్గ ప్రక్కలో సిరిఫిరి పడుకోవడం ప్రారంభించింది. నెల తప్పిందని దుర్గ గ్రహించింది, కొన్నాళ్లు పోయిన తర్వాత. సిరిసిరికి మువ్వడు ఎడమయిన కొలదీ, అతడు కావాలనే వాంఛ ప్రబలమయింది. మువ్వడు మాత్రం నిగ్రహంతోనే ఉన్నాడు.

"మీ ఊరు బయలుదేరి పోదాంపద! నిన్ను నేను మీ వాళ్ల కప్పచెబుతాను. తప్పో ఒప్పో నా మనసు నేను తీర్చుకున్నాను. నిన్ను ఇంట్లో ఉంచుకోవడం, పామును ప్రక్కలో పడుకోపెట్టడమే. నువ్వు ఇంకొకళ్లను నీకు నచ్చిన వాళ్లను చేసుకో! మన ఆచారం ప్రకారం అల్లాచేసుకున్నందుకు నాకు సొమ్మేమి ఇవ్వక్కరలేదు. బుద్ధిపూర్వకంగా నిన్ను వదిలేస్తున్నాను" అన్నాడు మువ్వడు ఒక రోజున.

"నేను ఎక్కడికి పోను. నాకెవ్వడి మీదా మనసు లేదు. ఉంటే అది నీమీదే ఉంది. నాకున్నదల్లా నీ మీద కసి. నా వాళ్లను తన్ని నన్ను బలవంతంగా లాగుకువచ్చావని! నాకు నెల తప్పడంతో ఇప్పుడా కసిపోయింది. నీ మీద మక్కువ పెరిగింది. భద్రాద్రిరాముడి సాక్షిగా చెబుతున్నాను అని సిరిసిరి మువ్వడి కాళ్ల మీద పడింది. అతడు "నిజమా!" అని, లేవతీశాడు.



ఒక విమానంలో ఇండియా, రష్యా అమెరికా దేశాలకు చెందిన ముగ్గురు వ్యక్తులు ప్రయాణిస్తున్నారు. ఇంతలో అమెరికా వ్యక్తి 'మా దేశంలో గడియారాలు చాలా ఎక్కువ' అని తన చేతి గడియారాన్ని కిందికి విసిరేశాడు. తర్వాత 'మా దేశంలో వస్త్రాలు ఎక్కువ' అని రష్యా దేశస్థుడు తన వస్త్రాలు తీసి కిందికి విసిరాడు. ఇది చూసిన భారతీయుడు 'మా దేశంలో జనాభా ఎక్కువ' అని విమానంలో నుంచి దూకేశాడు.

కె. రాధిక
శోభనాద్రిపురం.

## సెరిబ్రల్ పాల్సీ శిశువులవ్యాధి

పాల్సీ అంటే ఒక రకమైన పక్షవాతం. పుట్టుక సమయంలో మెదడుకు దెబ్బ తగలడం వల్ల వచ్చే జబ్బు సెరిబ్రల్ పాల్సీ. ఇది శిశువు చలనాన్ని, అంగవిన్యాసాన్ని ప్రభావితం చేస్తుంది. అటువంటి శిశువులు ఎదుగుతున్న కొద్దీ నడవడం కష్టమవుతుంది. శరీరం మెలికలు తిరిగిపోయినట్లుంటుంది. ఇటీవల కాలం వరకు ఈ వ్యాధికి సరైన చికిత్స లేదు. అటువంటి పిల్లలు జీవితాంతం చక్రాల కుర్చీలో గడపవలసిందే.

అమెరికాలో వెయ్యిమంది శిశువుల్లో 2 నుంచి 6 వరకు ఈ వ్యాధికి గురి అవుతున్నారు. ప్రపంచం అంతటా ఇంకా అనేక మంది ఇటువంటి వారున్నారు. ఇటువంటి శిశువులు పెద్దయినా పూర్తిగా ఇతరుల మీద ఆధారపడి ఉండవలసిందే. వారిని పెంచి, పెద్దవారిని చేయడం తల్లిదండ్రులకు తీరని సమస్యగా ఉంటుంది.

సెరిబ్రల్ పాల్సీలో కేంద్ర సమస్య మెదడుకి దెబ్బ తగలడం. బాహ్య పరిసరాల నుంచి వచ్చే సంకేతాలు, మెదడు నుంచి వచ్చే సంకేతాలు ఒకదానికొకటి నప్పకపోతే కండరాలు బిగుసుకుపోతాయి. మామూలు మానవ శరీరంలో ఒక కండరం వుత్తేజం చెందినపుడు అది వెన్నుపాములోని నాడీ కణాలకు ఉత్తేజకరం సందేశాలు పంపుతుంది. అదే సమయంలో ఆ నాడీకణానికి మెదడునుంచి నిరోధక సందేశం అందుతుంది. శరీరం ఈ రెండు సందేశాల మధ్య సంతులనాన్ని సాధిస్తుంది. అప్పుడు కండరం మామూలుగా పనిచేస్తుంది. సెరిబ్రల్ పాల్సీ వల్ల నాడీకణాలు దెబ్బ తిన్నప్పుడు శరీరం జరిపే సంతులన చర్య గాడి తప్పుతుంది. ఫలితంగా నిరోధక సందేశాల కన్నా వుత్తేజక సందేశాలు ఎక్కువగా అందుతాయి. సెరిబ్రల్ పాల్సీ వున్న శిశువులో కండరాల బిగువు ఎక్కువవుతుంది. ఫలితంగా కదలికలు ఎగుడుదిగుడుగా ఉంటాయి.

సుమారు 7,8 సంవత్సరాల క్రితం అమెరికాలో సెరిబ్రల్ పాల్సీ రోగుల చికిత్సకు రైజోటోమి అనే సరికొత్త శస్త్రచికిత్సను ప్రవేశపెట్టారు. ఈ పద్ధతిలో వెన్నుపాము నుండి నాడులు బయలుదేరే ప్రదేశంలో కొన్ని ఎంపిక చేసిన నాడులను కత్తిరించి వేస్తారు. సాధారణంగా 3 నుంచి 5 సంవత్సరాల మధ్య వయసు పిల్లలకు ఈ ఆపరేషన్ చేస్తారు. కొంతమంది డాక్టర్లు ఇంకా కొంచెం పెద్ద పిల్లలకు ఆపరేషన్ చేయడానికి ఇష్టపడతారు.

పాకుతున్న పిల్లలకి ప్రత్యేకించి ఈ శస్త్ర చికిత్స చేస్తే వారు నడవగలుగుతారని న్యూయార్క్ యూనివర్సిటీ మెడికల్ సెంటర్‌కి చెందిన డా. రిక్ అబ్బాట్ అభిప్రాయపడుతున్నారు. పూర్తిగా ఇతరుల మీద ఆధారపడుతున్న పిల్లలకి ఈ చికిత్స చేస్తే వారిని చూసుకోవడం కొంచెం సులువవుతుంది.

వెన్నుపాము నుంచి బయలుదేరే 48 నాడులలో 12 నాడులు శరీరం కింది భాగంలోని కండరాలను నియంత్రిస్తాయి. ఈ ఆపరేషన్‌లో ఇవే ప్రధానమైనవి. ముందు శిశువు వీపు మీద ఒక కోత కోస్తారు. తరువాత ఒక్కొక్క నాడికి ఎలెక్ట్రోమియోగ్రాఫ్ అనే యంత్రం సహాయంతో విద్యుదుత్తేజం కలిగిస్తారు. అదే సమయంలో శిశువు కాళ్లను పరిశీలించి ఏ కండరం ప్రతి చర్య చూపుతుందో గమనిస్తారు. అసాధారణ ప్రతిచర్య కలిగించే నాడులను కోసేస్తారు. సగటున కింది భాగాలను ప్రభావితం చేసే మొత్తం జ్ఞాన నాడీ మూలాలలో సుమారు 40 శాతం కత్తిరించేస్తారు.

శస్త్ర చికిత్స తరువాత కొంతకాలం ఫిజియోథెరపి చేయవలసి ఉంటుంది. ఈ చికిత్స పొందిన రోగులలో 80 శాతం మంది ఆశించిన ఫలితాలు పొందుతున్నారని న్యూయార్క్ యూనివర్సిటీ మెడికల్ సెంటర్ వారంటున్నారు. వారింత వరకు 375 ఆపరేషన్లు చేశారు.

ఇతర హాస్పిటల్స్‌లో కూడా అమెరికాలో చేస్తున్నారు.

ఆశించిన లక్ష్యాలు ప్రతి శిశువుకు వేరుగా వుంటాయి. కొంత మందికి నడవడం లక్ష్యం కాగా మరి కొంత మందికి నడక మెరుగవడం కావాలి. రోగి పరిస్థితిని బట్టి కోరిన ఫలితాలు మారతాయి. అంతేకాక సెరిబ్రల్ పాల్సీ ఉన్న శిశువులందరికీ రైజోటోమీ పనికిరాదు. రోగి బాలన్స్ సరిగా లేక మరీ అయోమయంగా వుంటే ఈ చికిత్స పనికి రాదు.

ఈ చికిత్స దీర్ఘకాలిక ప్రభావాలను గురించి ఇప్పుడు పరిశోధనలు జరుపుతున్నారు.

—ఆర్.ఎల్.ఎన్. శాస్త్రి